
క్లుప్తంగా

నేడు గుండె జబ్బుల వైద్య నిపుణుల రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్థన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రేకుల షెడ్డు ఏర్పాటు



పంచ లింగాల కోన ఆలయం వద్ద నిర్మించిన రేకుల షెడ్డు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె గ్రామాల సమీపంలో ఉన్న పంచ లింగాల కోన ఆలయం వద్ద పెట్రోల్ బంక్ చెందిన గోపాల్ శెట్టి రేకుల షెడ్డు నిర్మించారు. పంచలింగాల కోనలో కార్తీకమాసంలో ఎంతో వైభవంగా కార్తీక మాస పూజలను ఆలయ అర్చకులు నిర్వహిస్తారు. అంతేగాక కార్తీకదీపం మహోత్సవాల సందర్భంగా పులివెందుల నియోజకవర్గం నుంచేకాక వివిధ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పంచ లింగాలను దర్శించుకుంటారు. పంచ లింగాల కోన ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.2 లక్షలతో గోపాల్‌శెట్టి రేకుల షెడ్డు నిర్మించారు. దీంతో ఆలయ అర్చకులు దాత గోపాల్ శెట్టికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న సచివాలయ సిబ్బంది

జమ్మలమడుగు : మరణించిన అనాథశవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు కన్నెలూరు సచివాలయ సిబ్బంది. శనివారం కన్నెలూరు గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న చావిడిలో ఉంటున్న ఆమల్ల వెంకటరెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో శనివారం మరణించారు. అనాథ మృతదేహాని అంత్యక్రియలను నిర్వహించటానికి గ్రామంలోని పెద్దలైన మురళీధర్‌రెడ్డి, కొండారెడ్డి, రెవెన్యూ సచివాలయ సిబ్బంది కలిసి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ మధుసూదన్‌రెడ్డి

తొండూరు : స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ అధికారులు, వెలుగు సిబ్బంది అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో పీఎం వెంకటనారాయణ, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ నాగసుబ్బరాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్ సుధీర్ కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చింతకొమ్మదిన్నె : కడప–చిత్తూరు జాతీయ రహదారిపై శనివారం రాత్రి 9 గంటల సమయంలో మూలవంక గ్రామం వద్ద కడప నుంచి చింతకొమ్మదిన్నె వైపునకు వస్తున్న ఆటో (ఏపీ39 గి 1412)ను బుగ్గలేటిపల్లె వైపు నుంచి వేగంగా వస్తున్న బైక్ (ఏపీ39 ఒఒ 1639) ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న స్థానిక చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన లక్షుమ్మ, రెడ్డెమ్మ, అనే మహిళలతోపాటు నరసింహ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ లో వెనకాల వున్న వ్యక్తికి గాయలైనట్లు తెలిసింది. ఆటోలోని ప్రయాణికులను వెంటనే 108 అంబులెన్సు ద్వారా రిమ్స్ ఆసుపత్రికి చికిత్స కొరకు తరలించారు.

బాలోత్సవ వేసవి హంగామా

కడప కల్చరల్ : కడప బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేసవి హంగామాను మే 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నామని గౌరవ అధ్యక్షులు నాగముని రెడ్డి , అధ్యక్షులు గుర్రాల గోపాల్ తెలియచేశారు. యేటా వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ సంవత్సరం 6వ తరగతి నుంచి 10 వ తరగతి చదువుతున్న పిల్లలతో చేపట్టనున్నట్లువారు తెలిపారు.

శిథిలావస్థలో డీఆర్డీఏ కార్యాలయం

- పెచ్చులూడుతున్న కార్యాలయ భవనాలు
- భయాందోళనలో కార్యాలయ సిబ్బంది



పులివెందులలోని డీఆర్డీఏ కార్యాలయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న డీఆర్డీఏ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు, డ్వాక్రా సంఘాలలోని సభ్యులుగా ఉండి వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు, పలు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు డీఆర్డీఏ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించి ఉండటంతో కార్యాలయం పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది భయాందోళన చెబుతున్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా పనిచేస్తున్న సిబ్బంది తలలకు గాయాలైనట్లు వారు తెలిపారు. అలాగే వర్షాలు పడినప్పుడల్లా గోడలు పైకప్పు నుంచి వర్షపు నీరు ఉరుస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కార్యాలయంలో రెండు గదులను పైకప్పు పెచ్చులూడుతుండటంతో మూసివేసినట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని అనేకమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి డీఆర్డీఏ కార్యాలయాన్ని మినీ సెక్రటేరియట్‌లోకి మార్చే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఆర్డీఏ కార్యాలయ సీసీలు, సిబ్బంది కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకుని డీఆర్డీఏ కార్యాలయ భవనం



పెచ్చులూడిన భవనం పైకప్పు

టెర్రరిజాన్ని రూపుమాపుదాం



కమలాపురంలో మానవ హారంగా ఏర్పడిన ప్రజలు



వేంపల్లెలో మృతులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కమలాపురం : ఐక్యంగా పోరాడుదామని, దేశంలో ఏ మూలన ఉన్నా వెతికి మరీ టెర్రరిజాన్ని రూపుమాపుదామని పలు హిందూ సంఘాల నాయకులు ముక్త కంఠంతో నినదించారు. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడులను వారు నిరసిస్తూ శనివారం రాత్రి స్థానిక గ్రామ చావడి నుంచి రైల్వే గేటు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సంబటూరు బస్టాండు వద్ద మానవ హారంగా ఏర్పడి ఉగ్రదాడి అసువులు బాసిన వారి ఆత్మకుశాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ముందుకు వచ్చి ఐక్యంగా పోరాడుదామన్నారు. దేశంలో ఏ మూలలో టెర్రరిస్టులు, టెర్రరిజం ఉన్నా సమర్థవంతంగా ఎదుర్కొని రూపుమాపుదామన్నారు. కశ్మీర్‌లో అమాయక పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడులు జరపడం పిరికిపంద చర్య అని అన్నారు. ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదన్నారు. దేశం మొత్తం ముక్త కంఠంతో ఖండించాలన్నారు. కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేయడం దుర్మార్గమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహంతుల్లా తెలిపారు. శనివారం వేంపల్లెలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన ఏపీకి చెందిన చంద్రమౌళి, మధుసూదన్‌లకు నివాళులర్పించారు. జమ్మూకాశ్మీర్‌లోని అందాలను చూసేందుకు వెళ్లిన అమాయక ప్రజలపైన ఉగ్రవాదులు దాడి చేయడం శోచనీయమన్నారు. దేశంలో జరుగుతున్న ఉగ్రవాదుల దాడులపై కూడా కేంద్ర ప్రభుత్వం స్పందించాలని ఆమ్ ఆద్మీ పార్టీ ద్వారా ఆయన డిమాండ్ చేశారు.

పులి వాహనంపై ఊరేగిన ఎల్లమ్మతల్లి

కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ ఎల్లమ్మ(హేలాంబ) అమ్మవారు ప్రత్యేకంగా అలంకరించిన పులి వాహనంపై ఊరేగి భక్తులను కనువిందు చేశారు.

ఈనెల 23వ తేదీ నుంచి జ రుగుతున్న ఎల్లమ్మ తిరునాల మహోత్సవాల్లో భా గంగా నాలుగో రోజు శనివారం అమ్మవారిని ప్రత్యే క పుష్పాలతో అలంకరించారు. కీ.శే. జొన్నలగడ్డ కోదండ నారాయణ, రాధాకృష్ణయ్య కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించి పుష్పాలంకారం చేశారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పులి వాహనంపై ఊరేగించారు. ఊరేగింపులో డప్పు వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

నేడు వైఎస్ అభిషేక్‌రెడ్డి జయంతి వేడుకలు

తొండూరు : వైఎస్సార్‌సీపీ యువనాయకులు, దివంగత వైఎస్ అభిషేక్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం కేక్ కటింగ్, వికలాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తొండూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

లింగాలలో..

లింగాల : వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి జయంతి వేడుకలను ఆదివారం నిర్వహిస్తున్నామని మండల కన్వీనర్ బాబురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

2న మండల సమావేశం

చింతకొమ్మదిన్నె : మండల సరసభ్య సమావేశాన్ని మే 2వ తేదీన చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశమందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు. మండల పరిధిలోని వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించనున్నారని, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని తెలిపారు.

హనుమజ్జయంతి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ నరసింహులు, తదితరులు

వేంపల్లె : వేంపల్లెలోని మెయిన్ బజార్‌లో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ, హిందూ బంధువుల ఆధ్వర్యంలో మే 22న హనుమజ్జయంతి ఉత్సవాల కరపత్రాలు, బ్యానర్లు, స్టిక్కర్లను వేంపల్లె సీఐ నరసింహులు, ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, అర్చకులు హరిప్రవీణ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉత్సవాలను మే 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు 3 వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వేంపల్లె పట్టణ పురవీధుల్లో మే 22న శ్రీఆంజనేయస్వామి గ్రామోత్సవం, తాళమేలాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ బాణ సంచాలతో వైభవంగా నిర్వహించనున్నారు. హిందూ బంధువులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వేంపల్లె మండల పరిధిలోని ప్రతి గ్రామాల్లో బ్యానర్లు కట్టి ఉత్సవాల్లో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే శనివారం శనిత్రయోదశి పురస్కరించుకుని ఆలయంలోని నవగ్రహ దేవతల మండపంలో శనేశ్వర స్వామివారికి ఆలయ అర్చకులు ప్రధాన అర్చకులు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు శనేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, హిందూ బంధువులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నిరుద్యోగులు ఐక్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి సాధించుకున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ లో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని తక్షణమే కూటమి ప్రభుత్వం పరిష్కరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివ కుమార్ తెలిపారు. శనివారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసిలను డీఎస్సీకి అనర్హులు చేసే నిబంధనలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీలో 45 శాతం, 50 శాతం మార్కులు ఉండాలి అనే నిబంధనను తొలగించి అందరికీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో సైతం 40 శాతానికి అనుమతి ఇచ్చారని గుర్తు చేశారు. సిలబస్ విస్తృతి రీత్యా అభ్యర్థులకు ప్రిపరేషన్ కు 90 రోజులు సమయం ఇవ్వాలన్నారు. దాదాపు 55 పుస్తకాలు రివిజన్ చేసుకోడానికి కూడా ప్రభుత్వం ఇచ్చిన సమయం సరిపోవడం లేదన్నారు.


పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్



కల్లూరుపల్లె తాండాలో పర్యటిస్తున్న ప్రొహిబిషన్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్

చక్రాయపేట : మండలంలోని కల్లూరుపల్లె తాండా గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో శనివారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి రవి కుమార్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, పోలీసు శాఖలు సంయుక్తంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అక్రమంగా తయారు చేసే మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించడం, అనుమానితుల ఇళ్లు, పాత నిందితుల ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం వారు గ్రామంలో ఫ్లాగ్ మార్చింగ్ నిర్వహించి ప్రజలలో చైతన్యం కల్పించారు. అనంతరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ నవోదయం-2.0 కార్యక్రమం కింద ఈ ఆపరేషన్ చేపట్టామని, ఇది మద్యం అక్రమ తయారీని పూర్తిగా నిర్మూలించేందుకు చేపట్టిన చర్యలలో భాగమన్నారు. ప్రజల సహకారంతో నాటు సారా తయారీ, అమ్మకం, రవాణా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ జీవనోపాధి కింద కొందరిని గుర్తించి ప్రభుత్వం తరపున లోన్లు ఇప్పించే ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఎక్సైజ్ శాఖ సీఐ చెన్నారెడ్డి, ఎస్ఐలు కృష్ణయ్య, ఉలసయ్య, ముద్దనూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విన్నీలత, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుపై అక్రమ కేసు అన్యాయం




డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, బాధితురాలు

జమ్మలమడుగు: పెద్దముడియం మండలానికి చెందిన రైతు మధుసూదన్‌రెడ్డిపై సోలార్ కంపెనీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుబ్బారావు దొంగతనం కేసు నమోదు చేయడం అన్యాయమని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం డీఎస్పీ వెంకటేశ్వర్లును బాధితుడి కుటుంబంతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ కంపెనీ ప్రతినిధులు ప్రభుత్వ భూములతోపాటు, పట్టా భూములలో కూడా రైతులకు తెలియకుండా పనులు చేపట్టారన్నారు. దీనిని ప్రశ్నించిన రైతుపై తప్పుడు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం దారుణమన్నారు. దీనిపై విచారణ చేపట్టి బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు.

సోలార్ కంపెనీపై బాధిత రైతు సుజాత ఫిర్యాదు

సోలార్ కంపెనీ ప్రతినిధులు యంత్రాలు తీసుకుని వచ్చి పట్టా భూముల్లో తమకు తెలియకుండా పనులు చేస్తుండటంతో అడ్డుకున్నందుకు తమపై దాడికి పాల్పడినట్లు బాధితురాలు అక్కంరెడ్డి సుజాత డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. తాను, తన కూతురు అడ్డుకుంటే తమపై దాడి చేయడంతోపాటు తమ కుమార్తె కాలి పట్టీలను లాగేసుకున్నారని బాధితురాలు డీఎస్పీ ముందు వాపోయింది. పోలీసులు సోలార్ కంపెనీ ప్రతినిధులపై కేసు నమోదు చేయకపోతే ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం



మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలను వివరిస్తున్న ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి

చింతకొమ్మదిన్నె : యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి సూచించారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం చింతకొమ్మదిన్నె పరిధిలోని స్విస్ట్ ఇంజనీరింగ్ కాలేజీలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, అంతేగాక చిన్నచిన్న పరిశ్రమలలో పని చేసే కార్మికులు, కూలీలు వీటికి అలవాటు పడి కుటుంబాలు కూడా చిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు దాపరిస్తున్నాయన్నారు. తల్లితండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలుగన్న వారి కలలను కల్లలుగా చేస్తున్నారని, మత్తు పదార్థాల వల్ల మైండ్ తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారని, సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ సమాజం నుండి దూరమవుతున్నారన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ, మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం అభివద్ధి చెందాలంటే ప్రధానంగా యువత కీలకమని, ఎవరూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. కళాశాల సమీప ప్రాంతాలలో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో స్విస్ట్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ సురేష్‌బాబు, హెచ్‌ఓడీ మాధవ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

25శాతం ఉచిత సీట్లు కేటాయింపు

కమలాపురం : విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12 (1) (సి) ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి మండలంలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలో పేద విద్యార్థులకు ఒకటవ తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని ఎంఈఓ–1, 2లు బేబి, సుభాషిణీలు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇందులో అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూలు కులాలు 10 శాతం, షెడ్యూలు తెగలు 4 శాతం, బలహీన వర్గాలకి (బీసీ, మైనార్టీ, ఓసీ) 6 శాతం సీట్లు కేటాయిస్తారని వారు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్లో గాని, లేదా సమీపంలోని సచివాలయం, మీసేవ కేంద్రాలు, ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని వారు తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి మే నెల 15వ తేదీ వరకు గడువు ఉందని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

గౌరీదేవివి తప్పుడు ఆరోపణలు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం కొండపాపాయపల్లికు చెందిన పి.గౌరిదేవి దిగువ కల్వటాల గ్రామంలో వారసత్వంగా వచ్చిన 40 ఎకరాల భమిని ఇతరుల పేరుతో రికార్డుల్లో ఎక్కించామని తప్పుడు అరోపణలు చేయడం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ గౌసియాబేగం, ఆర్ఐ భువనేశ్వరిలు తెలిపారు. టీడీ, ఆర్ఐలపై చర్యలు తీసుకోవాలంటూ పత్రికల్లో రావడం జరిగింది. తాము తప్పుడు పనులు చేయలేదన్నారు. పెద్దముడియం మండలం పాపాయపల్లి గ్రామానికి చెందిన పి.గౌరిదేవి కల్వటాల గ్రామంలో సర్వే నంబర్ 691/1,691/3,722 సర్వేనంబర్‌లలో ఎటువంటి సాగుభూమిలేదు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ పోస్టర్‌లో 2017 ఆగస్టు 1వ తేదీ వరకు కైప పెద్ద నాగిరెడ్డి పేరిట నమోదై ఉందన్నారు. ప్రస్తుతం సర్వే నంబర్ 691/1,691/3,722 నంబర్‌లలో ఎలాంటి మార్పులు జరుగలేదన్నారు. కేవలం 691/5పి1లో నమోదైన భూమి కైప పెద్దనాగిరెడ్డి మరణించడంతో ఆయన భార్య కైప పుణ్యవతమ్మ పేరిట పోతీ కేసు ద్వారా మాత్రమే భూమిని మార్పు చేయబడిందన్నారు. అయితే గౌరిదేవికి ఎటువంటి పత్రాలు గాని, అనుభవంలోగాని లేరు. తమ పేరిట లేని భూమి వారిపేరు మీద రాయాలని పలు సార్లు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ భూమి కుటుంబ సభ్యుల తగదాలో ఉండటంతో తాము ఆమె పెట్టుకున్న దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని టీటీ, గౌసియా, ఆర్ఐ భువనేశ్వరిలు వెల్లడించారు.

